టీనేజ్ లవ్ స్టోరీ

# పూల పల్లకీ

పి. నాని

బ్రహ్మానందం మరింత ఆనందంలో ఉన్నాడు. దావికి కారణం లేకపోలేదు. హడావుడిగా కనిపిస్తున్నాడు. ఖంగారు ఖంగారుగా అగుపిస్తున్నాడు. నేలమీదే ఉన్నాడా అంటే సందేహమే.




"ఏవిట్రా ఆ హడావిడీ!" అని వాడి బామ్మ వాడ్ని పొద్దున్నించీ గమనించినదై ఉండబట్టలేక అడిగింది.

చిన్నగా విజిలేస్తూ 'ఏం లేదులేవే' అనేసేడు.

'ఏం లేకపోవడవేవిట్రా–ఊహ్–పొద్దున్నించి చూస్తున్నా నీ వాలకం. కాఫీ ఇస్తే మీదొలక పోసేసుకున్నావ్. బట్టలు తడుపుదాం కదా అని సర్ఫ్ కలిపిన నీళ్ళ బక్కెట్లోంచి మూడు నాలుగు చెంబులు మీద పోసుకునేవరకూ నీకు తెలిసిఛావలేదు. అదేం స్నానంరా అంటే వెర్రి ముఖమేసేవు. తువ్వాలు చేత్తో పట్టుకుని బోసిమొలతో బాత్రూంలోంచి బయటికొచ్చేసేవు. పైగా అడిగితే–ఏం లేదు. అంటావా? మీ తాతా ఇంతే. ఆయన గార్కి ఇష్టమైందిగాని, ఇష్టం కానిది కాని ఆ రోజు జరిగితే ఆయనా ఇలాగే ప్రవర్తించేవారు. అన్నీ ఆయన పోలికలే వచ్చి చచ్చాయి నీకు.' అంటూ బుగ్గ ల్నొక్కుకుంటూ బోసి నవ్వు నవ్వుతూంది బామ్మ.

'బామ్మా! నేనేం మాట్లాడినా నేనేం చేసినా అన్నీ ఆ తాతతో పోలుస్తావు. నీకంటికి నేనే వన్నా తాతలా అగుపిస్తున్నానా ఏవిటి ఖర్మ' అన్నాడు అద్దంలో ఆరోసారి తల దువ్వుతూ.


'అలా దువ్విఛావకు. మీ తాతా ఇంతే... అలా దువ్వి దువ్వే బోడుగుండయ్యేంత వరకూ అద్దం ముందు నుంచి వచ్చారుకాదు...' అంది మనవడిలో వాళ్ళాయన్ని చూసుకుంటూ.

'నన్ను బట్టలేసుకుని బయటికి వెళ్ళనిస్తావా. లేక ఇలా నా ప్రతి కదలికని ఆ తాత్తో పోల్చి నన్ను ముసలాడ్ని చేసేస్తావా' అన్నాడు కాస్త విసుగ్గా.

'పొద్దుట్నించి చూస్తున్నాను. ఆ బట్ట విప్పి ఇది, ఈ బట్ట విప్పి అది తొడుగుతున్నావ్– మళ్ళా కట్టినవన్నీవిప్పి దండాన్నంతా పోగులు పెట్టావు. ఆ అద్దం ముందు నించి ఇవతలికి రావు. పైగా నేనేదో విన్ను ఆపేస్తున్నట్లు...' అంటూ వంటింటి వైపు వెళ్ళిపోయింది.

తనకిష్టమైన బ్రౌన్ కలర్ పాంటులో లైట్ బిస్కెట్ కలర్ షర్టుని టక్ చేసుకుని 'బావున్నానా?' అని తనను తన్ను ప్రశ్నించుకుని ఆ బానేవున్నానని ఆనందపడ్డాడు. తల కొంచెం పైకెత్తి కుడి కన్నును చూరువైపు ఓరగా

ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక 15-3-96




సారించి 'ఆ గజలక్ష్మికి నా గెటప్ నచ్చు తుందా?' అని ఓ ఆలోచన పారేస్కుని, 'నచ్చకేం—ఈ డ్రస్సులో వేనచ్చం పిచీ హీరోలా అగుపడ్తాను. అందులో సందేహం లేదు. అనుకుని సమాధానపడ్డాడు. ఆ పాంటుకు కుస్తో దగ్గర కుట్లూడిన సంగతి పాపం ఆ బ్రహ్మానందానికి తెలియదు. అది తెలియచెప్ప డానికి ఆ కోపంలో ప్రస్తుతం ఎవరూ లేరు. ఉన్న ఒక్క బామ్మకీ చూపు సరిగా ఆనదు.

పాపం వాడలాగే బయటికి వెళ్ళిపోతాడేమో!

ఏమో ఏవిటి? అదుగో—వెళ్ళిపోతున్నాడు.

బ్రహ్మానందానికో ఊహాసుందరుంది. వాడికి యవ్వనం వచ్చాక, బుద్ధి ఆడపిల్లలవైపు మళ్ళడం ప్రారంభించాక, చూపులు ఆడపిల్లల కొలతల్ని వల్లె వెయ్యడం ఆరంభించాక వాడి బుర్రలోకి ఓ ఊహా సుందరి ఫార్మవుతూ వచ్చింది.

విజయశాంతిని చూసి తన ఊహాసుందరి 'ఈమే' అనేసుకుంటాడు. శ్రీదేవిని చూసి విజయశాంతి కాదు శ్రీదేవే ఆ నా ఊహా సుందరని అనుకుంటాడు. పక్కింటి పిన్నిగా రింటికి బంధువులమ్మాయొస్తే 'అదిగదిగో—ఇదే ఇదే' అని దొడ్డిగుమ్మంలోంచి, వీధరు గుమీంచి, డాబామీంచి—అన్ని ఏంగిల్సులోనూ చూసి ఊ—ఇదైపోతాడు.

అలా ఎవర్ని చూస్తే వాళ్ళే తన ఊహా సుందరనుకుని ఇదైపోతున్న బ్రహ్మానందానికి 'గజలక్ష్మి' ప్రమాదవశాత్తూ సిటీబస్సులో అగు పించింది.

వాళ్ళూ కాదు, వీళ్ళూ కాదు—ఈ గజలక్ష్మే నా ఊహాసుందరి—అని దృఢ నిశ్చయానికొచ్చే శాడు. అఫ్‌కోర్సు ఆ పిల్లని చూసిన వెంటనే ఆ అమ్మాయి పేరు తెలీదనుకోండి ఆ పిల్ల వెంట పడీ పడీ నోటు బుక్ మీద ఎ.వి.వి. ఎస్.ఎస్. గజలక్ష్మి అని పేరు చదవగల్గేడు. అలా తెలిసింది.

ఎ.వి.వి.ఎస్.ఎస్. గజలక్ష్మి అంటే ఆ కొంటె వీరవెంకట సత్య సూర్య గజలక్ష్మి వరప్రదాయిని అని. ఆ పిల్ల పేరు ఎంత పొడుగో ఆ పిల్ల అంతే పొట్టి. పేరేమో గజలక్ష్మా—గున్న ఏనుగులాగ ఉంటుందను కునేరు. అబ్బే, సన్నగా రివటలా ఉంటుంది.

అందుకే బ్రహ్మానందం అనుకుంటాడు గదా—

పిల్లలు పుట్టంగానే ఏదో ఒక పేరు పెట్ట కుండా, అందాకా ఏ ముద్దు పేరో ఒకటి పెట్టి కాస్త పెద్దయ్యాక వాళ్ళ రూపు రేఖల్ని బట్టి తగిన పేరు పెట్టాలీ అని.

'లావణ్య' అని పేరుందనుకోండి ఓ అమ్మా యికి. పెద్దయ్యాక చూస్తే ఆ పిల్లలో ఇసు మంతైనా కనిపించదు లావణ్యం. 'రూపవతి' అని ఓ అమ్మాయి పేరనుకుందాం. పగలు చూస్తే రాత్రి కల్లోకొచ్చేయొచ్చు.

అలాగే మగాళ్ళవైపొస్తే—

'అప్పారావు' అతని పేరనుకుందాం. ఛస్తే అప్పులు చేయకపోవచ్చు. 'సుబ్బారావు' అను కుందాం— వాడు మహా తెలివైన పిండం కావచ్చు. అలాగే శ్రీ. వేంకటేశ్వర వరప్రసాద్ అని మరోడి పేరనుకోండి. వాడు పరమ నాస్తికుడవవచ్చు. కాబట్టి—

బొద్దూడని వెధవాయిల్కి పేరెట్టేయడం సబబు కాదేమోనని ఇలా గజలక్ష్మిలాంటి వాళ్ళని చూసినపుడల్లా అనిపిస్తూంటుంది బ్రహ్మానందానికి.

అప్పడప్పడు బ్రహ్మానందం తన పేరు తనే తల్చుకుని బెంబేలుపడిపోతూంటాడు. ఎందు కంటే, కొంపదీసి తన పేరుకు వ్యతిరే కంగా తన జన్మలో బ్రహ్మానందం కాదుకదా 'ఉత్తి' ఆనందమన్నా ఉంటుందో ఉండదోనని. అందుకనే అప్పడప్పడు తన పేరు మార్చేసుకో వాలని అనుకుంటుంటాడు.

ఇహపోతే—

బయటికి వచ్చిన బ్రహ్మానందం యమ ఆనం దంగా గజలక్ష్మి గురించే ఆలోచించేస్తూ సిటీ బస్‌స్టాప్ వైపు శరవేగంతో పోతున్నాడు.

గజలక్ష్మి ముందు విజయశాంతి బలా దూర్. గజలక్ష్మి ముందు శ్రీదేవి 'హుష్ కాకి'. పక్కింటి పిన్నిగారి చుట్టాలమ్మాయి సోదిలోకి రాదు. గజలక్ష్మి ముందు గజలక్ష్మే నిలబడగల్దు. అన్నీ కలిసొస్తే తనమాత్రమే నిలబడగల్దు. అంతేగాని మరెవ్వరూ కాదు.

తనకోసమే గజలక్ష్మి పుట్టింది. నో నో. గజలక్ష్మి కోసమే తను ముందు పుట్టేడు.

ఒకటా? రెండా?

పది నెలలు!

స్కూలుకు వెళ్తున్నప్పడూ వస్తున్నప్పడు కూడా వెంట పడీ పడీ చివరికి విన్న బస్సులో తనని చూసి నవ్వాక 'జన్మ ధన్యమయింది గదరా' అని మురిసిపోయేడు.

నవ్విందీ అంటే తను నచ్చే కదా—

నవ్విందీ అంటే తన ప్రేమ తెలిసేకదా—

నవ్విందీ అంటే తన ప్రేమ కోసమే కదా—

మరింక ప్రొసీడ్ అయిపోవచ్చు.

ఓ లవ్ లెటర్ గిలికి, గులాబి పువ్వుతో అందించేయొచ్చు.

* * *

బస్‌స్టాప్ వైపే దృష్టి సారించి, బస్‌స్టాప్ వైపే వెళ్తు పోతున్న బ్రహ్మానందం కళ్ళు ఒక్కసారిగా మెరిసాయి. ఓ లావుపాటి పదార్థం పక్కకి తప్పకోంగానే అతని వెనకే రెండు జళ్ళతో చేతిలోని పుస్తకాల్తో ఒయ్యారంగా గజలక్ష్మి కనిపించింది.

గజలక్ష్మికీ బ్రహ్మానందం కనిపించేడు.

'హాయ్' అంది ఖాళీగా వున్న చేత్తో.

వెనక్కి, ప్రక్కలకీ చూసి తననే అని నిర్ధా రించుకుని


తనూ 'హాయ్' అన్నాడు.

## మీకు తెలుసా?

* మనదేశంలో అతిపెద్ద మంచి నీటి సరస్సు "ఊలార్"

* అమెరికా అధ్యక్ష భవనం వైట్ హౌస్‌లో నివసించిన మొదటి అధ్య క్షుడు జాన్ ఆడమ్స్

— భోశ్రీ.




మళ్ళీ బ్రహ్మానందం నేలమీద లేదు.

గజలక్ష్మి కళ్ళింత చేసుకుని తన్మయత్వంగా అతన్నే చూస్తూంది. బ్రహ్మానందం ఆ మెరిసే కళ్ళలోకి సూటిగా గుచ్చిగుచ్చి చూస్తూ 'ఐ లవ్ యూ గజా ఐ లవ్ యూ' అన్నాడు.

సిగ్గుగా తల దించుకుని ఓరగా చూసింది.

మరింత దగ్గరయ్యాడు బ్రహ్మానందం.

'ఓ గజా–నా గజా–ఐ లవ్ యూ గజా' అన్నాడు తన్మయంగా ఆమె ముఖంలోకే చూస్తూ మళ్ళా.

'నా రాజా!' అంది.

'నా గజా!' అన్నాడు.

'నా రాజాధిరాజా' అంది మరింత ఇదిగా.

'నాలోని గజగజానికీ గజమా!' అన్నాడు తనూ. ఇదిగానే.

అలా అన్న వెంటనే జేబులోంచి రెండు తాయెత్తులు తీసాడు. ఒకటి ఆమెకిచ్చి ఒకటి తన దగ్గర ఉంచుకుని–

'ఆ తాయెత్తు నాకు కట్టు' అన్నాడు.

'ఎందుకు?' అని అంటూనే చేయి సాచింది.

'ఎందుకు అనడక్కు. తాయెత్తు మహిమ నీకు తెలియదు. అఫ్‌కోర్స్ అంతకు ముందు నాకూ తెలీదనుకో. మొన్నామధ్య ఓ'లవ్వానందస్వామీజీ' ఎదురుపడి ఈ తాయెత్తులు ఇచ్చాడు. ఇవి కట్టుకుంటే మన ప్రేమ ఫలించి పుష్పించి పూలై, కాయలై–పండైపోతుందట. మరందులో తిరిగే ఉండదట,

'నిజవా నా రాజా?'

'రాజాని కాను. బ్రహ్మానందాన్ని.'

'ఏమో, నాకు రాజా పేరే ఇష్టం. అదే బాంది.'

'ఇంతకు ముందే నేనూ పేరు మార్చుకోవాలనుకుంటూ వచ్చేను. నువ్వు మార్చేసేవు. నువ్వు రాజా అను, కూజా అను. ఏ పేర్న పిలిచినా నీ నోట తీయగా ఉంటుంది గజా!'

'గజా అన్కు. రోజా అను.'

'నా రోజా!'

'అద్గదీ. నాకు రోజా పూలంటే ఎంతిష్టమో!'

'నిజమా! మరి చెప్పవేం–అదిగో అటు చూడు–హాంఫట్–హీంఫట్' అన్నాడు కళ్ళు మూసుకుని.

రోజాల పూల పల్లకీ ప్రత్యక్షమైంది.

'ఆ పల్లకీ ఎక్కు రోజా! అలాలా వెళ్ళిపోదాం'

'మరి పిటీ బస్సో?'

'పూల పల్లకీని వదలి వెధవ పిటీ బస్సెక్కడవేంటి–విడ్డూరం కాకపోతేను. ఎక్కు...పారిపోదాం'

'అమ్మో! లేచిపోడమే?'

'ఛీ, లేచిపోవడం కాదు. మన ప్రేమ సామ్రాజ్యానికి మనం పోతున్నామన్నమాట. ప్రేమికులు అలాగే పోతారు'

'ఓహో, అలానా...'

'అవునవును ఎక్కు.'

ఇద్దరూ కల్సి పూల పల్లకీనెక్కారు. అది 'జ్జామ్' అంటూ గాల్లోకి లేచి 'జుయ్' మంటూ సాగిపోతూంది.

'మనమిప్పుడు ఎక్కడున్నాం' అతని భుజం మీద వాలిపోయి అరమోడ్పు కనులతో అడిగింది 'రోజా'.

'మన ప్రేమ సామ్రాజ్యంలో' అన్నాడు రెండు చేతుల్తో ఆమెను గట్టిగా హత్తుకుంటూ రాజా.

'మన సామ్రాజ్యమంటున్నావు. ఈ సామ్రాజ్యానికి నేనేమవుతాను?' అడిగింది ఆశగా.

'నా పిచ్చి రోజా! నువు పట్టపు రాణివి. నేను చక్రవర్తిని. ఆ కనబడే వేనవేల ప్రేమికులంతా మన సేవకులు. ఇదిగిదిగో ఈ కనబడుతున్న తుచ్ఛ మానవకోటి–అంటే–దిక్కుమాలిన పెళ్ళిళ్ళు పెద్దలుచేస్తే చేసుకున్న అధములంతా మనకు బందీలు.

వాళ్ళని మన కారాగారాల్లో బంధించి, హింసించి ప్రేమ బోధ చేస్తాం!'

'భలే భలే, మరి పెళ్ళిళ్ళయిపోయిన ఈ అమాంబాపతుగాళ్ళంతా మన ప్రేమ బోధ విని పెళ్ళాలు మొగుళ్ళని, మొగుళ్ళు పెళ్ళాల్నీ వదిలేసి వేరే వాళ్ళతో లేచిపోతే...' సందేహంగా అడిగింది.

'అదే కదా మనక్కావల్సింది. ఆ ప్రేమికుల్ని మన సేవకుల్ని చేసుకుంటాం. కాదని ఆ మొగుళ్ళనే, ఆ భార్యల్నే పట్టుకు వేళ్ళాడుతున్న వాళ్ళనంతా మన సామ్రాజ్యం నించి బహిష్కరిస్తాం. అప్పుడు ఎక్కడ చూపినా ప్రేమికులే! ఎటు చూపినా ప్రేమ జంటలే! జగమంతా ప్రేమ మయం' అన్నాడు తన చూపుడు వేల్తో ఆమె చిరు గడ్డాన్ని పైకెత్తి, ఆ ముఖం తన వైపు తిప్పుకుంటూ.

ఇంతలో హఠాత్తుగా 'అమ్మో మా అన్నయ్యో' అంటూ కెవ్వున అరచి పూల పల్లకీ మీంచి గెంతేసింది గజలక్ష్మి.

'అయ్యో, అలా గెంతెయ్‌కు గజా! నా రోజా! నా రాణీ! అంటూ తనూ గెంతేసి గజలక్ష్మిని గట్టిగా వాటేసుకున్నాడు బ్రహ్మానందం.

సాచి లెంపకాయ కొట్టింది.

కళ్ళు బైర్లు కమ్మాయి.

'అమ్మో!' అన్నాడు చెంపని చేత్తో పట్టుకుని.

కొట్టింది గజలక్ష్మి కాదు.

రోడ్డు మీద కూరలమ్మి.

కూరలబుట్ట ఎగిరి రోడ్డు మీద పడి కూరలన్నీ చెల్లాచెదురయ్యాయి.

'దొంగ సచ్చినోడా. నీకు అప్పా పెల్లెళ్ళు లేరంట్రా. పట్టపగలు నడి రోడ్డు మీద నన్నట్టుకుని నా రోజా, నా రాణీ–అంటావట్రా' అంటూ కాలరుచ్చుకుని మరో చెంప దెబ్బేసింది.

అప్పటికే రోడ్డుమీద చాలామంది గుమిగూడారు.

దూరాన్నించి లావుపాటి పదార్థం వెనకవించి గజలక్ష్మి దెబ్బలు తింటున్న బ్రహ్మానందాన్ని ఛీత్కారంగా చూస్తూంది.

'ఇదేవిటి! నేనెక్కడున్నాను? ప్రేమ సామ్రాజ్యంలో కాదా? అయ్యో, ఇదేవిటి? ఈ కూరలమ్మి, ఇదెందుకు తన కాలరుచ్చుకుంది? 'ఇదేమిటిదేమిటి...' అంటూ వాస్తవంలోకొస్తున్నాడు బ్రహ్మానందం.